క్లుప్తంగా

సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణం



నూతన కార్యవర్గంతో సంతకాలు చేయిస్తున్న ఎంపీపీ దొరబాబు

గండేపల్లి: సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. మంగళవారం జరిగిన మురారి సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి ఎంపీపీ మాట్లాడుతూ రైతాంగానికి కావాల్సిన సదుపాయాలు సొసైటీ ద్వారా సకాలంలో అందేలా చూడాలన్నారు. సొసైటీ చైర్మన్‌గా బత్తుల మునీశ్వరరావు, సుంకవిల్లి హరేరామకృష్ణ, ముమ్మణ్ని శ్రీనివాస్ పర్సన్లుగా నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. నూతన కార్యవర్గాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, మావిరెడ్డి భద్రరావు, తాళ్లూరి కృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు వరుపుల సాయం



బాధితులను పరామర్శిస్తున్న వరుపుల సుబ్బారావు

రౌతులపూడి: పెంకుటింట్లో ఏర్పడిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన స్థానిక శెట్టిబలిజపేటకు చెందిన బాధిత కుటుంబాలను ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు మంగళవారం పరామర్శించారు. తనవంతు సాయంగా కొంత నగదు, 25 కిలోల వంతున బియ్యం బస్తాలను బాధితులు బత్తిన కన్నయమ్మ, గుబ్బల రామయమ్మ కుటుంబాలకు అందజేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ నాయకుడు వాసిరెడ్డి జమీలు, జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీ, నాయకులు కేదారిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచక్రరెడ్డి

తుని: ఎన్నికల సమయంలో టీడీపీ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కపట హామీలతో ముందుకు వస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని 7, 8 వార్డుల్లో గృహ సారథులతో పార్టీ పట్టణ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి దాడిశెట్టి రాజా కృషితో పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. టీడీపీ నాయకులు చెప్పే అబద్ధాలను నమ్మితే ప్రజలే నష్టపోతారన్నారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని గృహ సారథులకు సూచించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అన్నవరం శ్రీను, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

గోకవరం: విశాల సహకార పరపతి సంఘం చైర్మన్‌గా దాసరి చినబాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక సూర్య ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

ఉపాధి కూలీ మృతి

జగ్గంపేట: గోవిందపురం గ్రామంలో ఉపాధి పనికి వచ్చిన మహిళ గుండెపోటుతో మరణించింది. గోవిందపురం గ్రామానికి చెందిన కొల్లు నూకమ్మ (64) మంగళవారం ఉపాధి పనులకు వచ్చిన కొద్దిసేపటికే గుండెపోటుకు గురైంది. ఆమెను సహ కూలీలు రాజపూడి పీహెచ్‌సీకి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మరణించిందని కూలీలు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాను నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు రెడ్డి లోవరాజు, కురాకుల రాజా తదితరులున్నారు.

అభివృద్ధికి సాక్ష్యాలు

- శరవేగంగా జరుగుతున్న పనులు
- త్వరలో అందుబాటులోకి మోడల్ పార్కు
- రూపురేఖలు మారిన పాఠశాలలు



మోడల్ పార్కు డిజైన్



తునిలో అధునాతన సదుపాయాలతో మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణం

తుని: అధికారంలోకి వస్తే ఇది చేస్తాం, అది చేస్తామని చెప్పే పార్టీలను చూస్తుంటాం. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలి.. సొంత ప్రయోజనాలకే పెద్దపీట వేసిన గత పాలకులూ సుపరిచితమే. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి రెండూ రేసుగుర్రాల చందంగా పరుగులు తీస్తున్నాయి. పట్టణంలోని ఏ వార్డుకు వెళ్లినా.. జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కన్పిస్తోంది. రహదారులు, కాలువలు, పాఠశాలలు, పార్కులు, తాగునీరు, విద్యుత్ వెలుగులు.. ఇలా చెప్పుకుంటూ పోతే మాటలు చాలవు. గడిచిన నాలుగున్నరేళ్లలో రూ.వందల కోట్ల మేలు ప్రజలకు జరిగింది. వీటిలో కొన్ని ఇవీ..

రూపురేఖలు మారిన విద్యాలయాలు

పురపాలక సంఘం పరిధిలో 18 పాఠశాలల్లో రూ.5.54 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. గతంలో ఉన్న పాఠశాలకు, ఇప్పటి పరిస్థితిని చూస్తే నమ్మశక్యం కాదు. పట్టణంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చోటుచేసుకొన్న మార్పు ఇంతా అంతా కాదు. విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉండే సదుపాయాల కంటే రెట్టింపు వసతులు కల్పించారు. ఏ పాఠశాలకు వెళ్లినా నందనవనాలను తలపిస్తున్నాయి. విద్యార్థులకు ఫర్నిచర్, డిజిటల్ బోర్డులు, మరుగుదొడ్లు, నాణ్యతతో కూడిన భోజనం ఇలా అన్నీ హైక్లాస్‌లో ఉన్నాయి.

అద్భుత వనాలు.. పార్కులు

పట్టణ పరిధిలోని 30 వార్డుల్లో 18 పార్కులు ఉన్నాయి. వీటిలో ఒక్క పార్కును గత ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. రోజంతా కష్టపడిన ప్రజలు సేద తీరడానికి అవకాశం లేదు. ఇది గమనించిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మున్సిపల్ పాలకవర్గానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాజా రాజబాబు, గణపతినగర్ పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రాజా రాజబాబు పార్కులో రూ.1.20 కోట్లు, గణపతినగర్ పార్కును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేపట్టారు. ఇందులో రాజా రాజబాబు పార్కులో స్కేటింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేశారు. విద్యార్థులు స్కేటింగ్‌లో శిక్షణ పొంది, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఇక గణపతినగర్ పార్కులో వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టులు, జిమ్, పిల్లలకు ఆట సామగ్రి, మ్యూజికల్ ఫౌంటెన్ తదితర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఇది తుని పట్టణానికే ఐకాన్‌గా మారనుంది. పార్కులో జరుగుతున్న పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కౌన్సిలర్లు పరిశీలించారు. త్వరలోనే పార్కును ప్రారంభిస్తామని ఆమె తెలిపారు.

ప్రజల కోసమే అభివృద్ధి



పట్టణ ప్రజల కోసమే పాఠశాలలు, పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. గత ప్రభుత్వం చేయలేని పనిని మేం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. మున్సిపల్ పాఠశాలలు కార్పొరేట్‌ను తలతన్నేలా మార్పు చెందాయి. ప్రజలకు ఆహ్లాదం, వినోదం పంచడానికి గణపతినగర్ పార్కును మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతున్నాం. ఇది త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. ఏ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి మా ప్రభుత్వంలో జరగడం ఆనందంగా ఉంది.

– ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, తుని

జేఈఈ మెయిన్స్‌లో ఏలేశ్వరం విద్యార్థికి 99.99 శాతం



సాయిమోహిత్

ఏలేశ్వరం: జేఈఈ మెయిన్స్‌లో ఏలేశ్వరం విద్యార్థి ప్రగళ్లపాటి సాయిమోహిత్ 99.99 శాతం మార్కులు సాధించాడు. పట్టణానికి చెందిన ప్రగళ్లపాటి కామేశ్వరరావు, అనురాధ దంపతుల కుమారుడు సాయిమోహిత్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నాడు. ప్రతిభ చూపిన సాయిమోహిత్‌ను పలువురు అభినందించారు.

16న మెగా వైద్య శిబిరం

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో ఈ నెల 16న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మాజీ ఎంపీ, జగ్గంపేట ఇన్‌ఛార్జి తోట నరసింహం ప్రారంభిస్తారన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా ఆస్పత్రి వైద్య బృందం సేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి



గోపాలపట్నం ఎస్సీపేటలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

గడప గడపకూ.. కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేకూర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలతో పాటు, అనేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని అందించారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. గోపాలపట్నంలో మంగళవారం గ్రామ సచివాలయ ఉద్యోగులు, అధికారులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీపేటలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. పింఛన్లు, రేషన్, వైద్యం వంటి సేవలను ఇళ్లవద్దే అందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ పర్యటించి, ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయబాబు, ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి, బెక్కం చంద్రగిరి, సాపిశెట్టి చిన్న, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ కటకం శివ, ఉప సర్పంచ్ పలివెల శ్రీను, ఎంపీటీసీ గునిమానికల ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శి గంపల రాము పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును మహిళలకు అందజేస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో స్థానిక శ్రీసత్యదేవ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడతగా మండలంలోని 17,645 మంది లబ్ధిదారులకు రూ.15.30 కోట్ల నమూనా చెక్కును తోట నరసింహం అందజేశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రధానంగా మహిళల సాధికారత, సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు దశలవారీగా రుణమాఫీ అందిస్తుండగా, మరో వైపు సున్నా వడ్డీతో పాటు, ఆసరా పథకంలో మంజూరైన నగదును నేరుగా డ్వాక్రా సంఘాల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇప్పటి వరకు మండలంలో నాలుగు విడతల్లో సుమారు రూ.61.61 కోట్లు డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా పథకాలన్నీ పార్టీలకతీతంగా, ప్రజల ముంగిటకే చేరుతున్నాయన్నారు. ఇది ప్రచారాల ప్రభుత్వం కాదని, ఇది ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. మహిళలకు మరింత మేలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు తోట రాంజీ, తోట బాబ్జీ, పెనగంటి రాజేష్, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పాముల చంటి, కర్రి వెంకట రమణమూర్తి, దాడి చినబుజ్జి, ఓలేటి రాజు, పీలా సుబ్బు, అడారి గంగబాబు, ఏపీఎం ఇనకోటి శ్రీనివాస్, ఎంపీడీఓ బదే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం



ప్రత్తిపాడులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు



యూజే పురంలో వరుపులకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

- ప్రభుత్వానికి, ప్రజలకు వారధి వలంటీర్లే..
- ఆత్మీయ సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల

ప్రత్తిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు సాధ్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. సంక్షేమ సారథికి అండగా ఉందామని పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం మండల వలంటీర్ల, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికీ, ప్రజలకూ వారధిలా ఉండేది వలంటీర్లేనన్నారు. కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా అందించే వలంటీర్ల సేవలు శ్లాఘనీయమని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి, నెరవేర్చిన హామీలను చూసే వైఎస్సార్ సీపీ ఓటు అడుగుతుందన్నారు. ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు పార్టీకి ఉందన్నారు. పార్టీలకతీతంగా పథకాలు అందించిన తమకు ప్రజల నుంచి మద్దతు ఉందని తెలిపారు. 2024 ఎన్నికల్లోనూ విజయం సాధించడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావడం తథ్యమని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఎంపీడీఓ ఎస్ డేవిడ్‌రాజ్, ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం, సొసైటీ అధ్యక్షులు వరుపుల సూరిబాబు, దోశే హరిబాబు, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, నాయకులు బెహరా దొరబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం వైఎస్సార్ సీపీదే..

ప్రత్తిపాడు రూరల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. యూజే పురంలో సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు, ఎంపీటీసీ మేడసాని సింహాద్రి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావుకు స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఆదరణ గణనీయంగా ఉందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ (నాని), మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, ఎంపీటీసీలు ఉమ్మిడి తాతీలు, అమరాది కాశీ, నాయకులు రేఖా శ్రీను, గొల్లపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

రౌతులపూడి: కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు నవరత్నాల పథకాలను అందించిన వలంటీర్లు సంక్షేమ సారథులని వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు వాసిరెడ్డి జమీలు అధ్యక్షతన జరిగిన గ్రామ వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ వలంటీర్ వ్యవస్థ వైఎస్సార్ సీపీకి వెన్నుముక అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోను ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన ఖ్యాతి వలంటీర్లకు దక్కుతుందన్నారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ పాలనలో వలంటీర్ల వ్యవస్థ బాగస్వామ్యంపై దృష్టి సారించారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గుర్తు చేసి, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వలంటీర్లు సైనికుల్లా పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నూతనంగా ఎంపికైన పార్టీ మండల కన్వీనర్ పోలుపర్తి తాతాజీకి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్‌లు రాపర్తి రామకృష్ణ, కె.అర్జునమ్మ, సర్నం శ్రీను, నాయకులు కాకి నాని, జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



కొత్తకొట్టాంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ



సింహాద్రిపురంలో వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్



ఇటికాయలపల్లిలో శిబిరాన్ని పరిశీలిస్తున్న గుల్లా ఏడుకొండలు

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందని సర్పంచ్ దొగ్గా లక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తకొట్టాంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు యు.రాజశేఖర్, ఎం యామినికావ్య ఆధ్వర్యంలో 356 మందిని పరీక్షించి, మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ జయమాధవి పరిశీలించారు.

కిర్లంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం సింహాద్రిపురంలో నిర్వహించారు. వైద్యులు టి.సాయిహేమాంజలి, కిన్నెర, అశ్వనీ, శాంతి రంజని మొత్తం 290 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందిచారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాలపురెడ్డి కాపు, నంది వెంకన్న, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. ఇటికాయలపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా సీఎం రాష్ట్రాన్ని అన్నివిధాలా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని కోదాడలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఏ.వి.నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు పి.రవికుమార్, పి.భారతి రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ పసుపులేటి సతీష్, సర్పంచ్ బూర్తి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు దడాల విజయ్, బూర్తి నాని, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాజశ్యామల యాగం



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

గోకవరం: తంటికొండ వెళ్లే మార్గంలోని లే అవుట్‌లో మంగళవారం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో వేద పండితులు రాజశ్యామల యాగం నిర్వహించారు. కుంభ సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ యాగం నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్లు తగ్గుతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. కొత్తూరు గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలితో కూడిన జ్వరం, పళ్ల చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయా లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమ తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించాలన్నారు.

15న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

జగ్గంపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్టును స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఈ నెల 15న మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిక చేయనున్నట్టు రాష్ట్ర కబడ్డీ సంఘ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆటలో నైపుణ్యం, 55 కిలోల లోపు బరువు, 16 ఏళ్లలోపు వయసు వారు తమ ఒరిజినల్ ఆధార్ కార్డు, వివరాలతో జగ్గంపేటకు హాజరు కావాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 21 నుంచి 23 వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే 33వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీసు స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బ్రిడ్జి కౌంటీకి సమీపంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. గండేపల్లికి చెందిన తొండెపు వీరవెంకట సత్యనారాయణరెడ్డి (60) రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బైకుపై వెళుతున్నాడు. అతడిని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ రెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి సోదరుడు వెంకటరమణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలి

గండేపల్లి: సూరంపాలెం గ్రామస్తులకు స్థానిక ఆదిత్య విద్యాసంస్థల్లో ఉద్యోగ ప్రాధాన్యం కల్పించాలని మాజీ సర్పంచ్ కుంచే చినబాబు, వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం ఆయా సంస్థల వైస్ చైర్మన్ ఎస్ సతీష్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థలకు యూనివర్సిటీ గుర్తింపు లభించడంతో ఆయనకు వారు అభినందనలు తెలిపారు. సూరంపాలెం గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులను గుర్తించి, పూర్తి వివరాలు అందజేయాలన్నారు. ఉప సర్పంచ్ స్వామిన మణి భాస్కర్, పార్టీ నేతలు నల్లల శివసత్య గంగాధర్, కొట్టు శివరామకృష్ణ, అల్లం మూర్తి, ప్రగరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

తపోవనంలో ప్రత్యేక పూజలు

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో సహస్రమోదక మహాగణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మాఘ మాసం అంగరక చతుర్థి, కుంభ సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించరాదు

శంఖవరం: చట్టరీత్యా నేరమైన బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని ఐసీపీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ టీడీఎస్ పద్మావతి అధ్యక్షతన బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల జీవితం నాశనమైపోతుందన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు శిశు గృహంలో సంప్రదించాలన్నారు. ఏపీఎం ఏవీ రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా పూలగరగ సంబరం

ప్రత్తిపాడు: సత్తెమ్మతల్లి అమ్మవారి 45వ జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి కంఠస్ఫూర్తి వంశీయులు పూలగరగ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించి, పూలగరగను గ్రామంలో ఊరేగించారు. బాణసంచా, తీన్మార్ వాయిద్యాల నడుమ పూలగరగను స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ఊరేగించి, తిరిగి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.